మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మ్యాన్‌హోల్‌కు ఏర్పాటు చేసిన మూత

చిక్కడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా సివరేజీ మ్యాన్‌హోల్ పేరిట 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన వార్తకు వాటర్‌బోర్డ్ అధికారులు స్పందించారు. సోమవారం ఉదయమే సివరేజీ సిబ్బంది గాంధీనగర్ గజేంద్ర అపార్ట్‌మెంట్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేశారు. కొత్త మూతను ఏర్పాటు చేశారు. చుట్టూ ఉన్న మట్టిని కూడా తొలిస్తామని అపార్ట్‌మెంట్ వారికి చెప్పి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో పాదచారులు, వాహనచోదకులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న శోభన్‌బాబు చిత్ర గీతాలాపన

చిక్కడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): శోభన్‌బాబు అభిమాన మిత్రమండలి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ గీతాల విభావరి అందరినీ ఆకట్టుకుంది. పలువురు గాయనీగాయకులు ప్రముఖ సినీనటుడు శోభన్‌బాబు నటించిన సినిమాల నుంచి ఎంపిక చేసుకున్న మధురగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైంటిస్ట్ విశ్వనాథ్ మద్దిపట్ల ముఖ్యఅతిథిగా పాల్గొని గాయనీగాయకులను సన్మానించారు.

వేడుకగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి సుప్రభాతసేవ, పుణ్యాహవాచనం, బిందె తీర్థం, బాల భోగం, హవనం, పూర్ణాహుతి, బలిహరణం, చక్రతీర్థం, మహానివేదన, ద్వాదశారాధన, పుష్పయాగం తదితర ప్రత్యేకపూజలతోపాటు అశ్వవాహనసేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రత్యేకపూజల్లో భక్తులు, ఆలయ వ్యవస్థాపక వంశీయులు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, కీర్తి దంపతులు, ఈవో అన్నపూర్ణ పాల్గొన్నారు.

తాగునీటి, సివరేజీ పనులకు రూ.1.29 కోట్లు

చిక్కడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో రూ. 1.29 కోట్లతో గాంధీనగర్ డివిజన్‌లో నూతనంగా తాగునీటి, సివరేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్నామని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. సోమవారం డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్ వరకు, టీఆర్‌టీ బస్తీ దవాఖానా నుంచి ఆంధ్రాకేఫ్ సమీపంలోని నీమ్‌కర్ బిల్డింగ్, వీవీ గిరినగర్ బస్తీ, అరుంధతినగర్ బస్తీల వద్ద రూ.1.29 కోట్ల వాటర్‌బోర్డు నిధులతో పనులు ప్రారంభిస్తున్నామని వివరించారు. త్వరలో ఈ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి మార్కెట్‌కు 'పచ్చడి' మామిడికాయ

చిక్కడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): పచ్చడి సీజన్ మొదలైంది. ఈ సీజన్‌లో మామిడికాయ పచ్చడి సువాసనతో ప్రతి ఇంటిని పరిమళింపజేస్తుంది. చిక్కడపల్లిలోని మార్కెట్‌లో పచ్చడి మామిడికాయల అమ్మకాలు విస్తృతంగా జరుగుతున్నాయి. పచ్చడికాయలు చిక్కడపల్లి మెట్రోస్టేషన్ వద్ద ఉన్న మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి దాదాపు రెండు నెలలపాటు పచ్చడి కాయలు అమ్ముతుంటారు. ప్రస్తుతం ఒక్కో కాయ రూ.20నుంచి రూ.25 వరకు పలుకుతుంది. ఎక్కువ మొత్తంలో తీసుకుంటే ధర కాస్త తగ్గిస్తున్నారు. ఒక కాయ కటింగ్‌కు రూ.5 తీసుకుంటున్నారు.

అకస్మాత్తుగా కూలిన చెట్టు



పడిపోయిన చెట్టును, తెగిపోయిన వైర్లను తొలగిస్తున్న సిబ్బంది

చిక్కడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అరుంధతీనగర్ బస్తీలో సోమవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా భారీ వృక్షం కూలిపోయింది. చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడ్డంతో వచ్చిన భయంకర శబ్దానికి స్థానికులు హడలిపోయారు. వైర్లు తెగిపోవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. అయితే ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో బస్తీవాసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తక్షణమే జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ ఎమర్జెన్సీ విభాగం, ఎలక్ట్రికల్ విభాగం అధికారులను అప్రమత్తం చేశారు. ఘటనాస్థలానికి వారిని రప్పించి డీఆర్‌ఎఫ్ మేనేజర్లు శ్రీను, సురేష్ వారి సిబ్బందితో చెట్టుకొమ్మలను తొలగింపచేశారు. ఎలక్ట్రికల్ సీబీడీ ఏఈ నర్సింగ్‌రావు వారి సిబ్బంది విద్యుత్‌ను పునరుద్ధరింప జేశారు. కార్పొరేటర్ సూచనల మేరకు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ చెట్టుపడిన స్థలంలో పనులను పరిశీలించారు.

చెట్ల కొమ్మలను తరలించిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది

నల్లకుంట, మే 19 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పోచమ్మ బస్తీలో నివసించే దివ్యాంగుడైన శ్యామ్‌గౌడ్ ఇంటి వద్ద చెట్ల కొమ్మలు పెరగడంతో పురుగులు ఇంటిపై పడుతున్నాయి. దీంతో అతని కుటుంబ సభ్యులు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ విషయాన్ని స్థానికుడు శ్యామ్‌గౌడ్ బీఆర్‌ఎస్ బాగ్‌అంబర్‌పేట డివిజన్ ప్రధానకార్యదర్శి కెంచె మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన మహేష్‌కుమార్ సోమవారం వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి సమస్య తెలుసుకున్నారు. వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హార్టీకల్చర్ సిబ్బంది చెట్ల కొమ్మల మొక్కలను నరికివేసి, తరలించారు.

'పెంచిన మెట్రోచార్జీలు, మద్యం ధరలను తగ్గించాలి'

రాంనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుతనంగా పెంచిన మెట్రోచార్జీలు, మద్యం ధరలను తగ్గించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం దోమలగూడలోని పార్టీనగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఆదాయం పెంచుకోవడం కోసం విచ్చలవిడిగా నిత్యావసరవస్తువులతోపాటు రవాణాచార్జీలను పెంచడం తగదన్నారు. ప్రజలపై భారంమోపకుండా ప్రభుత్వం ఆదాయ మార్గాలు పెంచుకోవాలన్నారు. పెంచిన ధరల వల్ల పేదలపై భారం అధికంగా పడుతుందన్నారు. టీడీపీ హైదరాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రతాపరెడ్డి మృతి పట్ల నగర కమిటీ సంతాపం ప్రకటించింది. ఆయన 2002 నుంచి 2004 వరకు అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్.ప్రకాష్, కృష్ణస్వామి పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీ

బర్కత్‌పుర, మే 19 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడి ల్యాప్‌టాప్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వేపీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. నిజామాబాద్‌కు చెందిన బోని సాంబకుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో నిజామాబాద్ నుంచి కాచిగూడకు వస్తుండగా అక్కన్నపేట రైల్వే స్టేషన్ వద్ద రైలు ఆగడంతో టీ తాగడానికి కిందకు దిగారు. తిరిగొచ్చేసరికి ల్యాప్‌టాప్ బ్యాగ్ కనిపించలేదు. బ్యాగులో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, రూ.500 ఉన్నాయి. సోమవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పట్టాలు దాటుతూ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వేపీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... యాకత్‌పుర-ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య 35 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయిపై ఉక్కుపాదం

ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ రామకృష్ణ | ఇంటర్వ్యూ...



గంజాయి విక్రయదారులను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

ముషీరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గంజాయి అమ్మకాలు పెరగడంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో గంజాయి అమ్మకాలను పూర్తిగా నిర్మూలించేందుకు ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. పాత నేరస్థులు, గంజాయి అమ్మకాల అడ్డాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.



రామకృష్ణ, సీఐ, ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్

రైల్వేస్టేషన్‌లు, బస్‌డిపోలు, ఆటో స్టాండ్‌లు, అనుమానిత షాపులు, వ్యక్తులను తనిఖీలు చేస్తూ గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ముషీరాబాద్ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి....

ఆంధ్రజ్యోతి: గంజాయి అమ్మకాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎక్సైజ్ సీఐ: గంజాయి అమ్మకాలను పూర్తిగా నివారించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేకబృందాలను ఏర్పాటు చేశాం. గతంలో గంజాయి అమ్మకాలు కొనసాగించిన ప్రాంతాలు, పాతనేరస్తులపై నిఘా ఏర్పాటు చేశాం. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి రహస్యంగా గంజాయిని తీసుకొచ్చే అనుమానిత వ్యక్తులను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి అమ్మకాల ప్రాంతాలను గుర్తించారా...?

ఎక్సైజ్ సీఐ: స్టేషన్ పరిధిలోని కవాడిగూడ, చిలకలగూడ, సీతాఫల్‌మండీ, అంబేద్కర్ నగర్, లాలాగూడ తదితర ప్రాంతాల్లో గతంలో గంజాయి అమ్మకాలు కొనసాగాయని గుర్తించాం. ఆయా ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గంజాయి అమ్మేవారిని, కొనుగోలు చేసేవారిని, గంజాయిని తీసుకువచ్చే వాహనాలను సీజ్ చేసి వ్యక్తులను అరెస్టు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పాత నేరస్థులు గంజాయి అమ్మకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎక్సైజ్ సీఐ: గంజాయి విక్రయదారులు మరోసారి గంజాయి విక్రయించకుండా కఠినంగా వ్యవహరిస్తున్నాం. నాన్‌బెయిల్ కేసులు పెడుతున్నాం. జైలుకు వెళ్లితే ఏర్పడే అనర్థాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలపై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి అమ్మకాల నివారణకు ప్రజల్లో ఎట్లా చైతన్యం తీసుకొస్తున్నారు..?

ఎక్సైజ్ సీఐ: గంజాయి విక్రయదారుల సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతున్నాం. అమ్మకాలు కొనసాగినట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజలకు గంజాయి వల్ల ఏర్పడే అనర్థాలు, సమస్యలపై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇటీవల గంజాయి కేసులు నామోదు అయ్యాయా...?

ఎక్సైజ్ సీఐ: గంజాయి అమ్మకదారులపై నిఘా పెట్టడం వల్ల వారు రాహస్యంగా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో తీసుకువచ్చే గంజాయిని పట్టుకోవడంతోపాటు ఆటోలను సీజ్ చేస్తున్నాం. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్, ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు వేర్వేరుగా గట్టి నిఘా ఏర్పాటు చేశాం. ఇటీవల లాలాగూడలో 1.2 కిలోల గంజాయిని పట్టుకున్నాం. కవాడిగూడలో సైతం గంజాయి విక్రయదారులను అరెస్టు చేశాం. నాగ్‌పూర్ నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న వారిని సైతం అరెస్టు చేశాం.

నాలా నిర్మాణ పనులు చేపట్టాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్



లలితానగర్‌లో నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

రాంనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షా కాలంలో ముషీరాబాద్ నియోజకవర్గంలో వరదనీటి సమస్య తలెత్తకుండా నాలా నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని లలితానగర్‌లో రూ.23 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న నాలా నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. లలితానగర్‌లో దెబ్బతిన్న నాలా వల్ల ప్రతి వర్షా కాలంలో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అడిక్‌మెట్ లలితానగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, బ్రహ్మం తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. దీంతో రూ. 23 లక్షల నిధులను మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి,కె.సురేందర్, నాయకులు మాధవ్, డాక్టర్ వీఎస్.రావు, మేడి సత్యనారాయణ, ధర్మ, సుబ్బారావు, జీహెచ్‌ఎంసీ డీఈ సన్ని, ఏఈ విశ్వేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు కల్పించేందుకు కృషి: టీపీసీసీ



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

రాంనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): పార్టీ పటిష్ఠత కోసం పనిచేసిన వారికి నామినేటెడ్, ప్రభుత్వ పదవుల్లో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి బోర్డు మాజీ చైర్మన్ జి.నాగభూషణం, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, టీపీసీసీ కార్యదర్శి లక్‌పతియాదగిరిగౌడ్ సోమవారం మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. నామినేటెడ్; ప్రభుత్వ పదవుల్లో అవకాశంకల్పించాలని కోరారు. అంబర్‌పేట నియోజకవర్గాలకు చెందిన సీనియర్ నాయకులకు అవకాశం ఇవ్వాలని కోరారు.

నత్తనడకన బాపూజీ నగర్ రోడ్డు నిర్మాణం



ముషీరాబాద్ డివిజన్ బాపూజీ నగర్ ప్రధానరోడ్డు అధ్వానంగా మారింది. దీంతో 10 రోజుల క్రితం ఉన్నరోడ్డును తవ్వి రాకపోకలను మూసివేశారు. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. ఈ రోడ్డు ముషీరాబాద్ చౌరస్తాకు, అటు పార్శిగుట్టకు వెళ్లే ప్రధానమార్గాలు కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల రాకపోకలకు సైతం ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- (ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)

సీఐకి సన్మానం



వారసీగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన సీఐ మధుసూదన్‌రెడ్డిని సోమవారం బీఆర్‌ఎస్ నగర నాయకుడు కె.మాధవ్; శ్యామ్ సుందర్ చిట్టిలు కలిసి సత్కరించారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



మాట్లాడుతున్న జూనియర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ

సామాజిక ఉద్యమకారులను విస్మరించిన ప్రభుత్వం

బర్కత్‌పుర, మే 19 (ఆంధ్రజ్యోతి): సమాచార కమిషనర్ల నియామకంలో సామాజిక ఉద్యమకారులు, బీసీలను ప్రభుత్వం విస్మరించిందని జూనియర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జక్కుల వంశీకృష, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ప్రధాన కార్యదర్శి శ్యామల రవీందర్, సోషల్ డెమోక్రటిక్ జేఏసీ అధ్యక్షుడు కోల జనార్దన్ మాట్లాడారు. అగ్రవర్ణాలకే ప్రభుత్వం అధికప్రాధాన్యం ఇచ్చిందన్నారు. త్వరలో భర్తీ చేయనున్న మూడు కమిషనర్ల పోస్టులలో రెండు సామాజిక ఉద్యమకారులకు, ఒకటి బీసీలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నందగోపాల్, సుధాకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

'సుందరయ్య స్ఫూర్తితో భూపోరాటాలకు సిద్ధమవుదాం'

చిక్కడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): సుందరయ్య స్ఫూర్తితో భూపోరాటాలకు సిద్ధమవుదామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్.వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలో వారు మాట్లాడారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టిచారికి నుంచి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సుందరయ్య దిశానిర్దేశం చేశారన్నారు. దేశ వ్యవసాయ రంగంలోని సంక్షోభం, ఆత్మహత్యలు భూఅసమానతలు నివారించడానికి సమాయత్తం కావడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందన్నారు. నాయకులు ప్రసాద్‌రావు, శోభన్, శివకుమార్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'వివేకానంద'లో మేనేజ్‌మెంట్ కోర్సులు

రాంనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్‌లో గల వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి నూతనంగా బీకామ్ (బీఎఫ్‌ఎస్‌ఐ), బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రభు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దోస్త్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం విద్యానగర్‌లో గల వివేకానంద ప్రభుత్వ డిగ్రీకళాశాలలో తెలుసుకోవాలని కోరారు.

మైసూర్ చాముండేశ్వరికి ప్రత్యేక పూజలు

ముషీరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని ప్రసిద్ధిగాంచిన చాముండేశ్వరి అమ్మవారిని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా సోమవారం దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అన్నిరంగాల్లో రాణించాలని కోరుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ అధ్యక్షురాలు స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి ఏసీపీగా శ్రీకాంత్

చిక్కడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ బదిలీఅయ్యారు. ఆయనను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా డీజీపీ జితేందర్ ఆదేశించారు. చిక్కడపల్లి నూతన ఏసీపీగా మాదాపూర్ ఏసీపీ సీహెచ్ శ్రీకాంత్‌ను నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు.

డ్రైనేజీ పైప్‌లైన్ బాగుచేయాలి: కార్పొరేటర్



బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న బతుకమ్మకుంటవాసులు

రాంనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంటలో సీసీ రోడ్డు నిర్మాణం వల్ల దెబ్బతిన్న డ్రైనేజీ పైప్‌లైన్‌ను వెంటనే బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం బతుకమ్మకుంటవాసులు ఆమెను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరు నెలలక్రితం నూతన డ్రైనేజీ లైన్‌ను వేశామన్నారు. అయితే సీసీ రోడ్డు వేసే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఈ సమస్య తలెత్తిందన్నారు. ఈ సమస్యను జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని స్థానికులకు ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణిస్తూ దేశ ప్రగతిని పెంపొందించాలి : కిషన్‌రెడ్డి



తైక్వాండో క్రీడాకారుడు సహదేవ్‌కు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న కిషన్‌రెడ్డి

ముషీరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణిస్తూ దేశప్రగతిని మరింత పెంపొందించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. సోమవారం ముషీరాబాద్‌కు చెందిన తైక్వాండో క్రీడాకారుడు కొండా సహదేవ్ తైక్వాండో క్రీడలో 12వ సారి గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించాడు. దీంతో ఆయన కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకుని క్రీడారంగాల్లో మరింత ప్రావీణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆర్‌వైవీ అందేలా చర్యలు : ఎంపీ



ఎంపీ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సయ్యద్ మోహినొద్దీన్

ముషీరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ మోహినొద్దీన్ అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిశారు. ముషీరాబాద్ నియోజకవర్గంకు చెందిన ప్రజలు రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ పథకం ఫలాలు అందేలా కృషిచేయాలని వినతిపత్రం అందజేశారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

బస్తీ దవాఖాన ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకళ



ముషీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న బస్తీ దవాఖాన ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకళ

ముషీరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రభుత్వ బస్తీ దవాఖానా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకళ సూచించారు. సోమవారం ముషీరాబాద్, భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (యూపీహెచ్‌సీ) నేషనల్ హెల్త్ మిషన్ సభ్యులు, డాక్టర్ శ్రీకళ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య అధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని దేవాదాయ శాఖ పరిధి నుంచి తప్పించాలి



మాట్లాడుతున్న ట్రస్ట్ బోర్డు చైర్మన్ వెంకట్రావ్

బర్కత్‌పుర, మే 19 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని దేవాదాయ శాఖ పరిధి నుంచి తప్పించాలని ట్రస్ట్ బోర్డు చైర్మన్ మ్యాడం వెంకట్రావ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వసతి గృహాన్ని మున్నూరుకాపులకు అప్పగించే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు పిల్లి శ్రీనివాసరావు, పన్నాల విష్ణువర్ధన్, అమరం చంద్రశేఖర్, ఎలగందుల దేవేందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కొందరు తమ స్వలాభం కోసం మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకోవాలని సీఎం, దేవాదాయ శాఖమంత్రి, కమిషనర్లకు లేఖలు అందజేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్తే మున్నూరుకాపు విద్యార్థులకు అందించే సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

'వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

నల్లకుంట, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయాగా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళపై ఆ పాఠశాలలోని అధ్యాపకులు కులపరంగా, లైంగికంగా వేధించిన వైనంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు ఆరోపించారు. ఈ ఘటనపై సదరు అధ్యాపకులు తాజ్‌బాబు, వెంకటరమణపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గత నెల 28వ తేదీన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నేటి వరకు పోలీసులు వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. సోమవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉండి నిరుపేద మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడడం దుర్మార్గ చర్య అన్నారు. దళిత మహిళకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో అన్ని దళిత సంఘాలతో కలిసి ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

చీఫ్ జస్టిస్ గవాయ్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా?

నల్లకుంట, మే 19 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు సొంత రాష్ట్రానికి తొలిసారి హాజరైతే అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు ప్రశ్నించారు. ఆ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీలు అక్కడికి వచ్చిన చీఫ్ జస్టిస్ గవాయ్‌కు స్వాగతం పలకకుండా అవమానించిన తీరుపై మేధావులు, ప్రజాస్వామికవాదులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గవాయ్‌ను అవమానించినట్లు ఆరోపించారు. ఇది ఒక సాధారణ పరిశీలనగా కనిపించినప్పటికీ తీవ్రమైన సామాజిక అవగాహన సమస్య దాగి ఉందని ఆయన ధ్వజమెత్తారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రపతులు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు ఆయా రాష్ట్రాల చీఫ్‌సెక్రటరీ, డీజీపీలు స్వాగతం పలకాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు మౌనంగా ఉన్నట్లయితే రేపు తమవంతు రాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఇకనైనా ఎస్సీ, ఎస్టీ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు జాతి ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని కోరారు.